క్లుప్తంగా

పురాతన బావిలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని పురాతన రెడ్డి వెంగన్న బావిలో శుక్రవారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల నుంచి చుట్టు పక్కల నివాసాల ప్రజలు బావిలో చెత్తాచెదారం పడేయడంతో భారీగా చెత్త పేరుకుపోయింది. కూలీల ద్వారా చెత్తను పూర్తిగా తొలగించి బావి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ చెప్పారు. గ్రామస్తులు బావిలో చెత్త వేయరాదని సూచించారు. ఊరికి మధ్యలో ఉన్న బావి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అందుకే తిరిగి వాడుకలోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల/అవుకు: కొలిమిగుండ్ల మండల పరిధిలోని పెట్నికోటలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలయ్యాయి. అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన పక్కీర ఏపీ ఫైబర్‌లో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా పెట్నికోటలో కేబుల్ టీవీ తీగ లాగే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మెయిన్ లైన్ కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికుల సాయంతో కొలిమి గుండ్లలో ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో అవుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్లారు.

నేడు కాశీనాయన ఆరాధనోత్సవం

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లలో వెలసిన కాశీనాయన ఆశ్రమంలో శనివారం 29వ ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని అభిషేకం, స్వామి వారి గ్రామోత్సవం, జ్యోతిప్రజ్వలన, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో భవానీ మాలధారులు

బేతంచెర్ల: మార్గశిర మాసం శుక్రవారం సందర్భంగా నంద్యాల రహదారిలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భవానీ మాల ధారులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. గురుస్వాములు సూరిబాబు, టైలర్ రాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బలిజ సంఘం అధ్యక్షుడి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

బనగానపల్లె: కృష్ణదేవరాయ బలిజ సంఘం మండల అధ్యక్షుడు గోపి శెట్టి వెంకటేశ్వర్లు(66) శుక్రవారం గుండెపోటు లో మృతి చెందారు. ఆయన మృతిపై సంఘం నాయకులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈయనకు భార్య భారతమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు దత్త జయంతి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఎస్సార్‌బీసీ కాలనీలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం దత్తజయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాగడహారతి, భక్తులతో బాబాకి పాలాభిషేకం, మధ్యాహ్న హారతి, సాయంకాల హారతి, పల్లకీసేవ, సత్సంగం, పాదపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మాలల మహాగర్జన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు

బేతంచెర్ల: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 15వ తేదీ గుంటూరు జిల్లా నల్లపాడులో నిర్వహిస్తున్న మహాగర్జన సభను జయప్రదం చేయాలని జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు బొల్లి మద్దిలేటి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. సంఘం సభ్యులు ఎద్దుల సుధాకర్, మునిస్వామి, సుధాకర్, పెరుమాల్, రామనాథ్, యన్నా జార్జి పాల్గొన్నారు.

కందులు.. కన్నీళ్లు

- రైతులకు నిరాశ మిగిల్చిన కంది పంట
- వర్షాలతో దెబ్బతిన్న పంట
- నియోజవర్గంలో సుమారు 3,993 హెక్టార్లలో సాగు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు



ఏపుగా పెరిగినా కాయలేని కంది పంట

బనగానపల్లె రూరల్: నియోజకవర్గంలో అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వేసిన కంది పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతన్నలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైతులకు దెబ్బ మీద దెబ్బ పడుతుండడంతో కోలుకోలేని స్థితిలో ఉన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. బనగానపల్లె నియోజకవర్గంలో బనగానపల్లె, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల, అవుకు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3,993 హెక్టార్లలో రైతులు కంది పంటను సాగు చేశారు. మొదట్లో కంది పంట ఏపుగా పెరడంతో రైతులు సంతోషించారు. అయితే ఆనందం ఎంతో కాలం నిలవలేదు. వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది. తెగుళ్లతో పంట మొత్తం దెబ్బతినడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచిన వర్షం

ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో వరుస తుపాన్లు, వర్షాలు కురవడంతో కంది పంటలో ఉన్న పూత, పిందె రాలిపోయాయి. కంది పొలంలో పంట ఏపుగా కనిపిస్తోంది తప్ప అందులో కాయాలు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు పంటకు ఉన్న కొద్దిపాటి కాయాలైన పంట కోత దశ వరకు ఉంటాయో లేదో అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు కోసం పెట్టుబడి కింద ఎకరానికి రూ.20–25 వేల వరకు ఖర్చు చేశారు. కౌలు రైతులకు అదనంగా మరో రూ.10 వేలు ఖర్చు చేయడం జరిగింది. వచ్చిన కొద్దిపాటి పంట అయినా చేతికి అందుతుందో లేదో అన్న అనుమానం కంది రైతుల్లో నెలకొంది.

నియోజకవర్గంలో కందిసాగు ఇలా..

మండలం	విస్తీర్ణం(హెక్టార్లలో)
బనగానపల్లె	1800
కోవెలకుంట్ల	397
సంజామల	621
అవుకు	471
కొలిమిగుండ్ల	704

కంది పంట పూర్తిగా నాశనం



కందిపంటకు గిట్టుబాటు ధర ఉంటుందన్న ఆశతో 1.50 ఎకరాల్లో కంది సాగు చేశాను. ఇప్పటి వరకు సుమారు రూ.25 వేల వరకు పెట్టుబడి కోసం ఖర్చు చేశాను. మొదట్లో పంట ఏపుగా పెరగడంతో దిగుబడిపై ఆశ ఉండేది. అయితే అకాల వర్షాలు, తూపాన్‌తో పాటు తెగుళ్ల నివారణకు తీసుకున్న చర్యల వల్ల కంది పంట ఏపుగా పెరిగినా పూత, కాయ రాలిపోయింది. దిగుబడి రెండు మూడు బస్తాలకు మించి వచ్చే అవకాశం లేదు. పరిహారం ఇచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలి.

–కుమారస్వామి, రైతు, పెద్దరాజుపాళెం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఖరీఫ్‌లో కంది పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. వర్షాలు, తూపానుల వల్ల పంట పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం కూడా విడుదల చేయకపోవడంతో రబీలో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులపై మానవతా దృక్పథంతో ఆలోచించి కంది పంట వేసిన రైతులను ఆదుకోవాలి.

–ఈశ్వర్‌నాయక్, రైతు, చిన్నరాజుపాళెంతండా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి, పలక చింతమాను ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కోదండ రామస్వామి సేవా బృందం, భజన కృష్ణయ్య ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జర్నలిస్టులపై దాడి అమానుషం



కోవెలకుంట్లలో ఆర్ఐ పుల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



కొలిమిగుండ్ల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న పాత్రికేయులు

కోవెలకుంట్ల: విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు అభివర్ణించారు. వైఎస్సార్ జిల్లా వేములలో శుక్రవారం సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షిపత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై మూకుమ్మడి దాడి చేశారు. దీనిని నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే(ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోవెలకుంట్ల మండల కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘం జిల్లా కమిటీ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సీపీఎం నేత సుధాకర్, యూనియన్ మండల అధ్యక్షుడు గుర్రప్ప, సభ్యులు మహేశ్వరరెడ్డి, రమణ, ఉసేనప్ప, మధుసుధాకర్ పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి దుర్మార్గం

కొలిమిగుండ్ల: మండల జర్నలిస్టు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డికి వినతి పత్రం అందించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో జర్నలిస్ట్‌లపై దాడులు జరగకుండా చూడాలన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్యాపిలి: సాక్షి విలేకరులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మండల విలేకరులు షఫీ, సుధాకర్ రెడ్డి, శేషయ్య, కృష్ణమూర్తి తదితరులు డిమాండ్ చేశారు. గుడిపాడు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. నిజాలను నిర్భయంగా రాసే పాత్రికేయులపై దాడి చేయడం ప్రజాస్వామ్యంలో సిగ్గు చేటన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

సంజామల: నిందితులపై చర్యలు తీసుకోవాలని మండల విలేకరులు తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సాక్షి ఖాశిం, సిక్స్ టీవీ మధు, ఐన్యూస్ సుభాస్, జీటీవీ చంద్ర, గణేష్ పత్రిక మహమ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

ప్యాపిలి: ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఎంపీడీఓ మాట్లాడుతూ సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని వాటిని సాధించాలన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

బనగానపల్లె రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. స్థానిక పొదుపు భవనంలో పంచాయతీల అభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. అందరూ కలిసి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే కాకుండా, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారామాపురం, శంకలాపురం గ్రామాల పరిధిలో డోన్ ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూలును సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన ప్రిన్సిపాల్

ప్యాపిలి: ఇంటర్‌మీడియెట్ విద్యార్థులు సరైన ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంకల్ప్–2025లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశామన్నారు. సబ్జెక్టులో సందేహాలు ఉంటే సంబంధిత లెక్చరర్లను సంప్రదించాలన్నారు. అధ్యాపకులు సత్యబాబు, నవీనపాటి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నివారించవచ్చని రామ్‌కో సిమెంట్ ప్లాంట్ హెడ్ రెడ్డినాగరాజు అన్నారు. ఏక్‌పేడ్‌మాకేనాం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్యాక్టరీ ఆవరణలో కేంద్రపర్యావరణ సంస్థ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కోటపాడులో గ్రామాలయ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కోటపాడులో స్మార్ట్ టాయ్‌లెట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒక్కో టాయ్‌లెట్‌కు రూ.50 వేలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్‌హెడ్ రామరాజు, ఏవీపీ సూర్యకాంత్, సీనియర్ జనరల్ మేనేజర్ రవికుమార్, మైన్స్ జీఎం అజ్మల్, కోటపాడు సర్పంచ్ సుంకమ్మ పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



బేతంచెర్ల: మాజీ మంత్రి బుగ్గనతో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు

డోన్: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు డోన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా తన స్వగృహం వద్ద బుగ్గన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నేతలు రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దళారీ వ్యవస్థను తొలగించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంట బీమాను పునరుద్ధరించాలన్నారు. అనంతరం 50 వాహనాల్లో డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొనేందుకు నంద్యాలకు తరలివెళ్లారు. మాజీ మంత్రి వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరాంరెడ్డి, బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ తదితరులు ఉన్నారు.



బేతంచెర్ల: ధర్నాకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రజలను మభ్యపెట్టడం బాబుకు అలవాటే

బేతంచెర్ల: ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేయడం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. బేతంచెర్ల మండలం నుంచి నంద్యాల కలెక్టరేట్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు భారీగా తరలివెళ్లారు. డోన్ నుంచి బేతంచెర్ల మీదుగా వెళ్తున్న ఆయనకు గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు, ఆయా గ్రామాల రైతులు ఆకు పచ్చ కండువా వేసి సత్కరించారు. అలాగే బేతంచెర్ల నుంచి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, రామచంద్రుడు ఆధ్వర్యంలో సుమారు 100 వాహనాల్లో తరలివెళ్లారు. నాయకులు చింతల నాగిరెడ్డి, పిట్టల జాకిర్, గూని నాగరాజు, మురళీ కృష్ణ, నాగ వెంకటేశ్వర్లు, యాకోబ్, తిమ్మయ్య, శేఖర్‌రెడ్డి, యాదగిరి వెంకటేశ్వర్లు, ఆకుల రమణ, నిరంజన్ వెళ్లారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి




నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కోవెలకుంట్ల/బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎల్ఎం కాంపౌండ్‌లో విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ గృహ వినియోగదారులు కరెంట్ బిల్లులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చార్జీలను పెంచడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలపై భారం ప డిందన్నారు. సీపీఎం నాయకులు రాములమ్మ,జో సెఫ్, శేఖర్, అచ్చమ్మ, సరోజ, లత పాల్గొన్నారు. అ లాగే బేతంచెర్ల పాత బస్టాండ్ వద్ద సీపీఎం నాయ కులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధుశేఖర్ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు.

సారా కేసులో ఇద్దరికి రిమాండ్

అవుకు: నాటుసారా తయారీ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో దాడులు నిర్వహించగా తిమ్మనాయునిపేటకు చెందిన దూదేకుల బాల హుసేని వద్ద 10 లీటర్ల నాటుసారా, రామాపురం గ్రామానికి చెందిన సాత్రి బాల నాగమ్మ వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వరి రైతుల ఆందోళన



వరి ధాన్యంపై కప్పిన టార్పాలిన్ పట్టలు

బనగానపల్లె: అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కల్లాల్లో ఉన్న వరిధాన్యంపై తడవకుండా టార్పాలిన్ పట్టలను కప్పి జాగ్రత్త పడుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 12 నుంచి 15వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటికే 50 శాతం పంటను రైతులు కోతలు కోసి విక్రయించగా మరికొంత పంట కల్లాల్లో ఉంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తుందనుకుంటే చేతులెత్తేసింది. దీనికి తోడు గత ఏడాది 75 కేజీల బస్తా రూ.2500 పలకగా ఇప్పుడు రూ.1500కు మించి కొనుగోలు చేయడం లేదు. తుపాన్ ప్రభావంతో మరింత నష్టపోతామన్న భయంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

కమనీయం.. తిరుచ్చి ఉత్సవం



స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆసీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన యువకుడు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని ఉడుములపాడు గ్రామం వద్ద శుక్రవారం బైక్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురు యువకులు గాయపడ్డారు. కృష్ణగిరి మండలం అముకదాడు గ్రామానికి చెందిన ఆశోక్, రాజేష్ మరో యువకుడి కలిసి డోన్‌కు బైక్‌పై వస్తున్నారు. ఉడుములపాడు గ్రామం నుంచి సోంపురం వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆశోక్, రాజేష్‌లకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభం



స్వామివారి సన్నిధిలో హోమాలు

డోన్: పట్టణ శివారులోని గురుదత్తాత్రేయ స్వామి ఆలయంలో శుక్రవారం దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో పురోహితులు కళ్లె శేషావలి శర్మ, గంగాధర శాస్త్రి, ప్రసాదశర్మ, కిరణ్ స్వామి, శ్రీనాథ్ శర్మ, వినోద్‌కుమార్ శర్మ, వినయ్‌కుమార్ శర్మ, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత, రుద్రాభిషేకాలు చేశారు. ఈనెల 15వ తేదీ వరకు జయంతి ఉత్సవాలు జరుగుతాయని ప్రధాన అర్చకుడు కళ్లె శేషావలిశర్మ తెలిపారు. అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు.